


ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ జయలక్ష్మి

రాజంపేట అర్బన్ : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత పాఠ్యపుస్తకాలను ఇంటర్మీడియట్ విద్యార్థినీలకు అందజేశారు. ఈ సందరరేగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినీలు పాఠ్యపుస్తకాలను చక్కగా చదివి జ్ఞానాన్ని పొంది రాజంపేట పట్టణంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రాణించాలని కోరారు. కళాశాల ఆవరణలోనే విద్యార్థినీలకు హాస్టల్ వసతి కలదని, దూర ప్రాంత విద్యార్థులకు ఇది మంచి అవకాశం అని తెలిపారు. ఇంటర్ విద్యార్థినిలకు ప్రభుత్వం ప్రత్యేకంగా పిజిటిలను నియమించిందని, ఎంపిసి, సిఇసి గ్రూపులలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కరీం, ముజఫర్ అహ్మద్, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, ప్రసన్నలక్ష్మి, శ్రీవాణి, శ్రీనివాసులు, నరేష్, పీడీ తులసి పాల్గొన్నారు.

వైద్యఆరోగ్యశాఖలో గందరగోళం

సూపరింటెండెంట్లలో ముగ్గురికి బదిలీలు నో

డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ల బదిలీల్లో నిర్లక్ష్యం

మాడిఫికేషన్ పేరిట ప్రత్యేక ఉత్తర్వు జారీ

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ ముగిసినప్పటికీ మాడిఫికేషన్ పేరుతో కొనసాగుతూనే ఉంది. ఈ నెల 20, 21, 22వ తేదీల్లో డిఎంహెచ్ఒ కార్యాలయంలో జోన్-4 పరిధిలోని వేలాది మంది ఉద్యోగులకు బదిలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆర్‌డి కార్యాలయ ఉన్నతాధికారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇష్టానుసారంగా బదిలీలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆఫీస్ సూపరింటెండెంట్, డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల బదిలీలను ఇష్టానుసారంగా చేశారనే విమర్శల నేపథ్యంలో కథనం...



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్య ఆరోగ్య శాఖ జోన్-4లో సుమారు 23 విభాగాల్లో సుమారు ఎనిమిది వేల మంది ఉద్యోగులు ఉన్నారు. కడప రీజినల్ డైరెక్టర్ ప్రాంతీయ కార్యాలయంలో నాలుగు ఉమ్మడి కడప జిల్లాలకు చెందిన ఉద్యోగులకు ఇటీవల బదిలీలు చేపట్టిన సంగతి తెలిసిందే. 700 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 శాతం నిబంధన కింద రెండేళ్ల రిక్వెస్ట్, ఐదేళ్ల కాలపరిమితి కలిగిన ఉద్యోగుల పారామీటర్ల కింద 525 మంది బదిలీలకు అర్హులైనట్లు సమాచారం. జోన్-4 పరిధిలో పాత ఉమ్మడి నాలుగు జిల్లాల్లో 55 మంది ఆఫీస్ సూపరింటెండెంట్లు ఉన్నారు. వీరికి 30 శాతం బదిలీ నిబంధనల కింద 16 మందిని బదిలీ చేయాల్సి ఉంది. నలుగురు సీనియారిటీ కలిగిన ఆఫీస్ సూపరింటెండెంట్లు మాత్రమే బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఒక్కరికి మాత్రమే బదిలీ చేసి మిగిలిన ముగ్గురిని అదేస్థానాల్లో యథా తథంగా కొనసాగించడం వెనుక మతలబేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ముగ్గురిలో ఎవరు కూడా ఎలాంటి సిఫారసు లెటర్లు కలిగిన జాబితాలో లేకపోవడం గమ నార్హం. వీరిలో ఒకరు తిరుపతి కావాలని కోరుకున్నప్పటికీ బదిలీ చేయక పోవడం గమనార్హం. మరొకరు అనంతపురం కావాలని కోరినప్పటికీ తథా తథంగా కొనసా గించడం విశేషం. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి చెందిన ఓ సూపరింటెండెంట్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీ జాబితాలో చూపించకపోవడం గమనార్హం. బదిలీలు ముగిసిన అనంతరం మాడిఫికేషన్ కింద కడప జిజిహెచ్‌కు ప్రత్యేక ఉత్తర్వుల పేరుతో బదిలీ చేయ డం విస్మయాన్ని కలిగించింది.

తంతుగానే స్టాటిస్టికల్ ఆఫీసర్ల బదిలీలు

జోన్-4 పరిధిలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ 15 మంది ఉన్నారు. 30 శాతం బదిలీల నిబంధనల కింద నలుగురిని బదిలీ చేయాల్సి ఉంది. ఇద్దరు అర్హులు ఉన్నప్పటికీ ఏఒక్కరినీ బదిలీ చేయకపోవడంపై విమర్శలు ఉన్నాయి. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ బదిలీల్లో మాయాజాలమే నడిచిందనే విమర్శలు ఉన్నాయి. 21 మంది అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు ఉండగా 30 శాతం నిబంధన కింద నలుగురు అర్హులైన ఉద్యోగులు ఉండగా ఇద్దరిని మాత్రమే బదిలీ చేయడం గమనార్హం. మిగిలిన ఇద్దరిని యథాతథంగా ఉంచడమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల బదిలీల్లో చోటుచేసుకున్న తప్పిదాలపై కొంతమంది ఉద్యోగులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే ప్రయత్నాల్లో ఉండడం గమనార్హం. దీనిపై ఆర్‌డి అనిల్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం పలుమార్లు చేయగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

రీసర్వే పనులు పూర్తి చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

సెప్టెంబర్ మాసాంతంలోగా జిల్లాలో గ్రామాల్లో చేపట్టిన రెండో దశ రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సిఎస్ కార్యాలయం నుంచి స్పెషల్ సిఎస్, సిసిఎల్ఎ సాయి ప్రసాద్ వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి రెండవ దశ భూహక్కు, రీ సర్వే, ప్రాధాన్యత భవనాలు, జగనన్నకు చెబుదాం అంశాలపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి ఆయా అంశాలలో ప్రగతి సాధనకు దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్, జెసి ఫర్మన్‌అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రెండవ దశ రీ సర్వే పకడ్బందీగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన దశల వారి ప్రక్రియలను ఆయా కాలపరిమితిలోపు తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రుతింగ్, వెక్టొరైజేషన్, విలేజ్ సెక్రటరీ, విఆర్‌ఒ, తహశీల్దార్, ఆర్‌డిఒ, జెసి లాగిన్‌లలో డేటా ఎంట్రీ పక్కాగా జరగాలన్నారు. ఎప్పటికప్పుడూ డేటా ఎంట్రీని రోజూ పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే చేశారు, ఎన్ని పూర్తి చేశారు, ఇంకనూ చేయాల్సిన గ్రామాలు ఎన్ని తదితరాలలో నివేదిక సమర్పించాలన్నారు. గ్రౌండ్ ట్రుతింగ్‌లో భాగంగా రెవెన్యూ రికార్డుల మేరకు ప్రభుత్వ భూములను, పట్టా భూములను పక్కగా రీ సర్వే చేయాలన్నారు. మొదటి దశ రీసర్వేలో గుర్తించిన లోపాలను సరిదిద్దుకొని రెండవ దశను పటిష్టంగా పూర్తి చేయాలన్నారు. రీసర్వేలో భాగంగా ల్యాండ్ కన్వర్షన్, ఆధార్ సీడింగ్, ఫొటోలు మిస్ మ్యాచ్ అంశాలలో తగు జాగ్రత్త వహించాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాలలో హద్దురాళ్లు నాటే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్స్, రైతు భరోసా కేంద్రాల్లో ప్రణాళిక మేరకు పురోగతి సాధించి ఆగస్టు మాసాంతంలోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా సిమెంట్ కొరత లేకుండా చూసుకోవాలని, ఉపాధి హామీ ద్వారా మెటీరియల్ పేమెంట్స్ ఎప్పటికప్పుడూ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాలలో చేపట్టిన పనుల వారీగా, దశల వారీగా, భవనం వారీగా సాధించిన ప్రగతిపై నివేదిక సమర్పించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ఆర్థికేతర వినతులు సంతృప్తి స్థాయి పెంచేలా నాణ్యతతో సత్వరం పరిష్కరించాలన్నారు. ఆర్థిక అంశంతో ముడిపడిన వాటిని ఆయా కాలపరిమితి గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమైందని వాలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, అర్హత ఉండి ఇంకా అందని ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకొని సచివాలయం వద్ద సంబంధిత అంశంపై టోకెన్ వచ్చేలా ఏర్పాటుచేసి ప్రజలకు పథకాల లబ్ధి అందేలా కృషి చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులందరూ సమన్వయంగా కృషి చేయాలన్నారు. సమీక్షలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమాజంలో అర్హులందరికీ న్యాయ సేవలు

- న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్

ప్రజాశక్తి-పీలేరు

సమాజంలోని అర్హులందరికీ ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నట్లు పీలేరు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం యొక్క విలువలు, వాటిని ఎలా ఉపయోగించుకోవాలి అనే విషయాలను క్లుప్తంగా వివరించారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, పేదల నుంచి ధనికుల వరకు న్యాయం అందరికీ ఒకటేనని చెప్పారు. ప్రతి విద్యార్థీ తాము తెలుసుకున్న విషయాలను గుర్తుంచుకుని వీటి గురించి తెలియని వారికి కూడా న్యాయ విలువలు, న్యాయ సేవల గురించి తెలియజేయాలని సూచించారు. సమాజంలో మనం స్వేచ్ఛగా బతకడానికి కొన్ని హక్కులు ఉంటాయని, వాటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి, ఉన్నత విద్యను అభ్యసించి, మీరూ మాలా ఒక న్యాయమూర్తిగా ఎదగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన, మెచ్చిన ఏదో ఒక రంగంలో రాణిస్తున్నప్పుడే మన సమాజం త్వరగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అందరూ న్యాయం విలువలు తెలుసుకుని, న్యాయ సేవ అధికార సంస్థ అనేది ఒకటుందని, న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలకు, మూడు లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి, ఈ లోక్ అదాలత్‌లో ఉచితంగా కేసులు పరిష్కరిస్తారని తెలిపారు. న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అనేక సంవత్సరాల నుంచి పెండింగులో ఉన్న కేసులకు కూడా ఈ లోక్ అదాలత్‌లో త్వరితగతిన పరిష్కారం దొరుకుతుందని అన్నారు. కేసు పరిష్కారం తర్వాత అర్హులైన కక్షి దారులకు కోర్టు ఫీజు కూడా తిరిగి చెల్లించడం జరుగుతుందని తెలియజేశారు. రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిలో విద్యార్థులకూ కొన్ని చట్టాలపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్.గాయత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ స్థాయిలో ఇటీవల ముంబైలో జరిగిన రోప్ స్కిప్పింగ్, ఆగ్రాలో జరిగిన మినీ ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం ఉదయం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని క్రీడల్లో రాణించి చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్య పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫణీంద్ర, ఆర్ వి రమణ, నాగరాజు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- రాయచోటి

తిరుపతి కేంద్రంలోని భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలచే సంయుక్తంగా నిర్వహిస్తున్న 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ, అప్లయిడ్ న్యూట్రిషన్' లో 2023-24 సంవత్సరానికి గాను కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ శివరాం కృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిహెచ్ఎస్ - 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్ - 45 శాతం మార్కుల పైబడి ఉన్న వారు అర్హులున్నారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు టెన్త్ పాస్ అయినవారు అర్హుని తెలిపారు. దరఖాస్తులు www.sihmtpt.org అనే వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జులై 6లోగా పంపాలన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో జాతీయ సదస్సు విజయవంతమైందని, క్రియాశీలక పాత్ర పోషించిన తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ బి.జ్యోతి, కె.శ్రీదేవిని ఆమె ప్రశంసించారు. యోగి వేమన యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీల అభివృద్ధి అనేది వారు శాస్త్రీయంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించినప్పుడే సాధ్యం అవుతుందన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.బాబు మాట్లాడుతూ స్త్రీల విద్యను అభ్యసించి ఆర్థికంగా తన కాళ్ల మీద నిలబడినప్పుడే మరింత ఆత్మవిశ్వాసంతో అన్నిరంగాలలో రాణించగలరని పిలుపునిచ్చారు. పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ఆచార్యులు కె.కృష్ణవేణి మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా జాతీయ సదస్సును 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మహిళల అభివృద్ధి, సవాళ్లు అనే అంశం మీద జాతీయ సదస్సులో స్త్రీల అభివృద్ధి సవాళు గురించి పరిశోధక పత్రాలను వివిధ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు సమర్పించారు. ఈ సదస్సుకు వనజ కో-కన్వీనర్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో శివపార్వతి, పరుశురాం, వాసు మోహనవల్లి, విష్ణుప్రియ, నమ్రత, మోహన్‌బాబు, సుబ్బారాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఈశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

'కస్తూర్బా'లో విద్యార్థులకు రక్షణ కరువు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థులకు రక్షణ లేదని టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ అన్నారు. శనివారం రాజంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని పెనగలూరు మండలం కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదానికి గతంలో అక్కడే పనిచేసిన ఎస్ఒ, అకౌంటెంట్ వెంకటలక్ష్మి ప్రమేయం ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. తక్షణమే జిల్లాస్థాయి అధికారులు వారందరిపైన విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలు రాజకీయాలకు నిలయంగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జి.శ్రీనివాసులు, వంశీకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి : ఎపి రైతు సంఘం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వితలం వెంకట రమణారెడ్డి, సిరిపురం రామచంద్ర పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో చలో విజయవాడ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని 30న విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అతివృష్టి, అనావృష్టి వర్షాల వల్ల రైతులు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినా రైతాంగానికి ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు కనీస ధరలు కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. జిల్లాలోని రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు వెంటనే ఆపాలన్నారు. ఉద్యాన పంటలు రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు, పాడి రైతులకు బోనస్ లీటరకు రూ.4 ఇవ్వాలన్నారు. వ్యవసాయ పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంట సాగు ద్వారా హక్కు పత్రాలు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలన్నారు. జిల్లాలో వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేయాలని కోరారు. అన్ని పంటలకు పంటల బీమా పథకం వర్తింపజేయాలని, గ్రామాల ప్రాతిపదికన పంటల బీమా పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఆర్ఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

గడిచిన నాలుగేళ్లల్లో రాష్ట్రంలో అవినీతి అరాచక అసమర్థ పాలనను సాగిస్తున్న వైసిపి దౌర్జన్యాలపై సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి 2024 ఎన్నికలే లక్ష్యంగా టిడిపి గెలుపు కోసం సోషల్ మీడియా ప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బోస్ నగర్‌లోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఎవరికి రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా వైసిపి నేతల దౌర్జన్యాలు, భూకబ్జాలు, అరాచకాలు పెరిగిపోయాయన్నారు. ఎక్కడ చూసినా ఇసుక మాఫియా, మట్టి మాఫియా, డ్రగ్స్ మాఫియా, వైన్ మాఫియాగా రాష్ట్రం అవతరించిందన్నారు. రాయచోటి నియోజకవర్గ విషయానికి వస్తే ఎక్కడే కానీ అభివృద్ధి జరిగినా దాఖలాలు లేవన్నారు. 2019 డిసెంబర్‌లో పట్టణంలో అండర్ డ్రైయినేజీని ఏర్పాటు చేస్తామని, ఈ ప్రభుత్వం గొప్పగా చెప్పారని, ఇప్పటివరకు మున్సిపాలిటీలో అండర్ డ్రైయినేజీ ఊసే లేదని తెలిపారు. వెలిగల్లు ప్రాజెక్టు నిండా నీళ్లు ఉన్నప్పటికీ కాలువలకు నీళ్లు విడుదల చేయకపోవడంతో ఆయకట్టుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రాజెక్టులో ఉన్న నీరు ఉన్న కాలువలకు రాకపోవడం అప్పట్లో కాలువలు పనులు చేసిన కాంట్రాక్టర్లు, ప్రస్తుత ఎంపీ మిధున్‌రెడ్డి పుణ్యమా అని కాలువలు తెగిపోయి పనులు నాశరకంగా చేపట్టడంతో కాలువలు తెగిపోయి ఆయకట్టు భూములకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసి వైసిపి నాయకులు పనులు చేసుకు నేందుకు అవకాశం కల్పించిందే తప్ప దానివల్ల రైతులకు ఒరిగింది శూన్యం చెప్పారు. నియోజకవర్గంలో వైసిపి నేతల భూకబ్జాలు, దౌర్జన్యాలు ఎక్కువ అయిపోయాయన్నారు. ఒకప్పుడు ట్రాక్టర్ ఇసుక రూ.1500లు ఉండేదని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.4000 పైగానే ధర పలుకుతోందని తెలిపారు. సామాన్యులు ఇల్లు కట్టుకునే పరిస్థితులు కూడా నేడు లేవన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ భాష, తెలుగు యువత అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, రామ్‌భూపాల్‌రెడ్డి, ఐటిడిపి నాగేంద్ర, కొవ్వూరు దివ్య కుమార్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి మల్లు నరసారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కాలాడి ప్రభాకర్‌రెడ్డి, మద్దిరేవుల రమేష్‌రెడ్డి, నాయకులు వెంకటశివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, అతావుల్లా, గుర్రం సుబ్బయ్య నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు సత్యారెడ్డి, మాధవరం రమణారెడ్డి, చిట్లూరు గౌడ్, మాజీ సర్పంచులు బసయ్య, జిలానిబాష, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కూనాసి సుబ్బరాజు యాదవ్, మల్లు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, సాయి పాల్గొన్నారు.



గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పక్కా గృహాల నిర్మాణాల పూర్తి కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని హౌసింగ్ అధికారులకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. శనివారం శిబ్యాల గ్రామలో హౌసింగ్ పీడీ సాంబశివయ్య, డిఇ చంద్రశేఖర్, మండల ఎఇ తదితర అధికారులతో కలసి రాయచోటి నియోజక వర్గంలోని జగనన్న కాలనీలు, సొంత స్థలాలలో మంజూరైన పక్కా గృహాల నిర్మాణాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచేలా విశేష కృషి చేయాలన్నారు. పునాదులు కూడా ప్రారంభించని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి లబ్ది దారులను చైతన్యం చేయాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు, మెటీరియల్స్‌ను అందజేయాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులలో లంచాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి

నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు స్థల సేకరణ తదితర అంశాలుపై శనివారం ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ చంద్రశేఖర్‌రెడితో ఆయన చర్చించారు. గాలివీడు మండలంలోని చీమల చేరువుపల్లె, అరవీడు , గుండ్ల చెరువు, రాయచోటి టౌన్‌లో మాసాపేట, రింగ్ రోడ్డు గుణ్ణికుంట్ల రోడ్డు, సంబేపల్లె మండలం రౌతుకుంట, లక్కిరెడ్డిపల్లె మండలంలో దప్పేపల్లె, రాయచోటి రూరల్ లో యండపల్లెలలో నూతన సబ్ స్టేషన్ల ఏర్పాట్లపై చర్చించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు, విద్యుత్ లైన్ల విస్తరణ తదితర అంశాలపై ఆరా తీశారు.

27న మినీ జాబ్‌మేళా

రాయచోటి: ఈ నెల 27న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనున్నాయని, వాటి ద్వారా జిల్లా లోని నిరుద్యోగ యువతి యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాలో పైపాల్ ట్రీ, మెల్మన్ ఆటో ఇన్‌ఫర్‌మేటివ్ ప్రయివేట్ లిమిటేడ్ వంటి బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటునాయని తెలిపారు. జాబ్ మేళాలో హాజరయ్యే నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతలు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, పీజీ చదివిన వారు, 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలతో అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8897776368, 9550104260లలో సంప్రదించాలని తెలిపారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఫర్విన్‌తాజ్

చంద్రబాబుపై మంత్రి విమర్శలు అర్థరహితం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన విమర్శలు అర్థరహితమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫర్విన్ తాజ్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం, గుడిపల్లి మండలంలో జరిగిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడం దారుణమన్నారు. నియోజకవర్గంలో ఏమాత్రం వెళ్లినా చంద్రబాబు చేసిన అభివృద్ధే కనపడుతుందన్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీ, ద్రావిడ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. టిడిపి హయాంలో హంద్రీ-నీవా పను లను 90 శాతం పూర్తి చేశారని, మిగిలిన పది శాతం పనిని వైసిపి నాలుగేళ్లలో పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా చంద్రబాబు పాలన చేశారని అన్నారు. వైసిపి నాలుగేళ్లలో అవినీతి, అరాచకాలు పెరిగిపోయాయని అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబుపై మంత్రి ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభాకర్, రవికుమార్, మహబూబ్‌సాబ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

చిరుధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలను సాధించవచ్చని రైతు భరోసా కేంద్రాల, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ వి.శ్రీకాంత్ అన్నారు. శనివారం నిమ్మనపల్లి సింగిల్ విండో కార్యాలయంలో చిరుధాన్య పంటలసాగు, యాజమాన్య పద్ధతులు, ఉత్పత్తుల వినియోగం పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరంగా భావించి జూన్ నెలలో చిరుధాన్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిరుధాన్యాలలో సజ్జలు, తిరుమల, ఇంద్రావతి వంటి మేలైన రకాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని అన్నారు. రాగి, సజ్జ, కొర్రలు, సాములు, అరికెలు వంటి చిరుధాన్య పంటలను సాగు చేయాలని సూచించారు. యాజమాన్య పద్ధతులలో భాగంగా కిలో విత్తనంకు రెండు గ్రాముల కార్బండిజమ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలని వివరించారు. ప్రతిరోజు చిరుధాన్య ఉత్పత్తులతో తయారుచేసిన ఆహారాన్ని తీసుకోవడం వలన మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. వేరుశనగ పంట సాగులో విత్తనశుద్ధి, కలుపుతీత, జిప్సం ఎరువు ఉపయోగాలను రైతులకు వివరించారు. రైతు భరోసా కేంద్రంలో, యంత్ర సేవా కేంద్రంలో లభ్యమయ్యే యంత్ర పరికరాలను బాడుగలకు ఉపయోగించుకుని తక్కువ మంది కూలీలతో వ్యవసాయం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వి.శ్రీకాంత్, కుమార్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి-సుండుపల్లి

స్థానిక గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లించలేదని తక్షణమే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు. తెల్లవారు జామున నాలు గంటలకే సుండుపల్లికి చేరుకొని పనులు చేపడుతున్నామని అన్నారు. కాలు వల్లో పూడికతీయడం, రోడ్లను శుభ్రం చేయడంతో పాటు డ్రైయినేజీ పనులు చేసి స్వచ్ఛంగా ఉంచుతున్నామని పేర్కొన్నారు. తామెంతో కష్టపడి పనిచేస్తున్నా వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఏడు నెలలుగా వేతనాలు కోసం నిరీక్షిస్తున్నామని కుటుంబ జీవనం గడవడం కష్టసాధ్యంగా మారిందన్నారు. పిల్లల చదువులకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులకు వేత నాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే ఆందోళన కార్య క్రమాలు చేపట్టాల్సి వస్తోందని తెలిపారు.

తాగునీటి మోటర్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-సుండుపల్లి

గ్రామపంచాయతీలో పెద్దబలిజపల్లెలో తాగునీటి బోరు చెడిపోవడంతో శనివారం పంచాయతీ సిబ్బంది అక్కడికి వెళ్లి మరమ్మతులు చేసినట్లు గ్రామస్తులు వెంకటయ్య, రామయ్యలు తెలిపారు. గత వారం రోజుల నుంచి మోటర్ చెడిపోవడంతో తాగునీటికి అనేక ఇబ్బందులను పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు స్పందించిన అధికారులు తాగునీటి మోటర్‌కు మరమ్మతులు చేయించి నీటి సమస్యను తీర్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సెక్రటరీలు పాల్గొన్నారు.

30న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 30న ఆదర్శ పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపల్ లీలా శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా సోమవారం నిర్వహించాల్సిన ప్రవేశ అర్హత పరీక్షను జూన్ 30 తేదీ నాటికి మార్చినట్లు డిఇఒ తెలిపారని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలోనే ప్రశ్న పత్రం ఉంటుందని తెలిపారు. 29వ తేదీ లోపల స్థానిక పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. 30న ఆదివారం ఉదయం పదిగంటల నుంచి 12 గంటల వరకు అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. **బి.కొత్తకోట :** జిల్లావ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహించాలని డిఇఒ ప్రకటనలో పేర్కొన్నట్లు బి.కొత్తకోట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ శీనునాయక్ తెలిపారు. ఆదర్శ పాఠశాలలో చేరాలనుకునే మండలంలోని విద్యార్థులు స్థానిక పాఠశాల కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణత ,రోస్టర్ ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు తమ పేర్లు నమోదు చేసుకొని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

రేషన్ బియ్యం సక్రంగా పంపిణీ చేయాలని తాసిల్దార్ భాగ్యలత ఎండియు ఆపరేటర్లకు, డీలర్లకు సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాల యంలో రేషన్ డీలర్లకు, ఎండియూ ఆపరేటర్లకు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సరైన సమయంలో డిడిలు చెల్లించి ఎండియులకు సహకరించాలని డీలర్లకు సూచించారు. డీలర్లు సంబం ధిత రికార్డులను తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని నిల్వ ఉన్న పరిమాణం కచ్చితంగా రికార్డు ప్రకారం ఉంచుకోవాలన్నారు. ఆథరైజేషన్‌ను సరైన సమ యంలో కచ్చితంగా రెన్యువల్ చేసుకోవాలని రేషన్ డీలర్లకు సూచించారు. ఎండియూ ఆపరేటర్లు ప్రతి ఇంటికి బియ్యం సరఫరా చేయాలని ధరలలో వ్యత్యాసం చూపకూడదన్నారు. అధికమైన ధరలు వసూలు చేయకూడదని ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత, డిటి సయ్యద్, సిఎస్‌డిటి నారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ చాణిక్య, డీలర్లు పాల్గొన్నారు.



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ భాగ్యలత

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం రెడ్డివారిపల్లి పంచాయతీలోని అయ్యావారిపల్లి, వడ్డేపల్లి, జంగంపల్లి, సోమన్నపల్లి, ఎర్రతివారిపల్లిలో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఎంపిపి నరసింహులు, స్థానిక సర్పంచు రెడ్డమ్మ, నరేంద్రరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి లతో కలసి ప్రతి ఇంటిలోని లబ్ధిదారులను, ప్రజలను పలకరించారు. ప్రజలకున్న సమస్యలను తక్షణం పరి ష్కరించడానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుక వచ్చామన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించడమే ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి లక్ష్యమని, వారి దిశా నిర్దేశాల మేరకు తాము కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్ర కమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, నాయకులు నరేంద్రరెడ్డి, శశిధర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, హరిబాబు, చంద్రారెడ్డి, నవీన్, హేమంత్, తహసిల్దార్ సి.ఆర్.మంజుల, ఎంపిడిఒ శేష గిరి రావు, పంచాయతీ కార్యదర్శులు మారప్ప, ఎర్ర మల్లయ్య నాయుడు, పోలీసు సిబ్బంది, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

సమస్యల పరిష్కారం కోసమే 'జగనన్న సురక్ష'



కలకడ : ప్రజలతో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని బి.కొత్తకోట నగర పంచాయతీ ఒకటో సచివాలయం కన్వీనర్లు గుమ్మడికాయల చాంద్‌బాషా, అంజమ్మలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తక్షణ పరిష్కారం కోసం ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్య క్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసు కువెళ్లి సమస్యల తక్షణ పరి ష్కారానికి కృషి చేయాల న్నారు.గృహసారథులు, వాలంటీర్లను కలుపుకొని ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామ న్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు అకౌంట్ ఆఫీసర్ రమాదేవి, ఆర్ఐ శ్రీని వాసులు ఆధ్వర్యంలో నగర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కిరణ్, ఒకటో సచివా లయం వెల్ఫేర్ మౌలా, మహిళా పోలీసు, వాలంటీర్లు శ్రీని వాసులు, గృహసారథులు తుమ్మగింజల జనార్ధన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని హౌసింగ్ ఎఇ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి జగదీష్‌లు తెలిపారు. శనివారం మండలంలోని డి. రాచపల్లి పంచా యతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల అధికారులు సచివా లయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు, ఇంటింటికి వెళ్లారు. కార్యక్రమంలో ముఖ్యంగా కులధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధృవీ కరణ, మరణ ధృవీకరణ, కుటుంబ ఆదాయ ధృవీకరణ, వివాహ ధృవీ కరణ, మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసం ధానం, పంట సాగు హక్కుకార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద నూతనంగా రూపొందించిన యాప్‌లో ప్రజల సమస్యలను నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్‌నెంబర్ ద్వారా వారి సమస్యను పరిష్కారం అవుతాయని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారి వెంకటేష్, ఎపిఎం ఖాదర్‌వలీ, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి జగదీష్, డీజిల్ అసిస్టెంట్ పెద్దిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.**పుల్లంపేట :** మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి హరిజనవాడ లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి పర్యటిం చారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రతి ఇంటి సమస్య పరిష్కారం దిశగా ఈ కార్యక్రమం సాగుతుందని సంక్షేమ పథకాల అమలు, ప్రతి గడపలోను సంక్షేమ పథకాల గురించి ఎటువంటి సమస్య రాకూడదని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహ కుమార్, విఆర్ఒ సోము శేఖర్‌రెడ్డి, దండ్లపల్లి సర్పంచ్ మణి మండలఅధికారులు పాల్గొన్నారు.**కలకడ :** జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎ పి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. ఏ సర్టిఫికేట్ కావాలన్నా ఇంటివద్దనే తీసుకొచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ బిసి కాలనీ నందు సర్వే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పరమేశ్వర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి లతీఫ్‌ఖాన్, ఎపిఒ చెన్న కేశవులు, సెక్రెటరీ షబానాభాను, సచివాలయం సిబ్బంది, సంఘమిత్ర, సిసిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించండి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలికిరి

పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్‌పి గంగాధర్‌రావు పోలీసులను ఆదేశించారు. శనివారం ఆయన కలికిరి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికా ర్డులను పరిశీలించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో వాలని, రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. దిశ కేసులపై ప్రత్యేక దృష్టి సాధించాలని, పలు కేసుల్లో వచ్చిన వాహనాలను వేలం నిర్వహించాలని సూచించారు. సైనిక్‌స్కూలు, ఐటిబిపి, సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్ బెటాలియన్ వద్దకు వెళ్లి ఆయా కమాండర్‌లతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఐ రహీముల్లా, ఎఎస్ఐ మధుసూద నాచారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐగా మహమ్మద్ అబ్దుల్ జహీర్ బాధ్యతలు

ప్రజాశక్తి-నందలూరు



ఎమ్మెల్యే మేడాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఐ

నందలూరు పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్‌ఐగా మహమ్మద్ అబ్దుల్ జహీర్ బాధ్యతలు చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీపై నందలూరు ఎస్‌ఐగా రావడం జరిగిందన్నారు. ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే ఉక్కుపాదం మోపు తామన్నారు. మండ లంలో శాంతి యుత వాతావరణాన్ని కల్పించేందుకు కృషిచేస్తానని అందుకు ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందిం చాలని కోరారు. **రాజంపేట రూరల్ :** బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మొహమ్మద్ అబ్దుల్ జహీర్ బోయినపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి బీరువా వితరణ

ప్రజాశక్తి-నందలూరు

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాజంపేటకు చెందిన ప్రియాంక నర్సింగ్ కళాశాల వారు శనివారం మండల వైద్యాధికారులు డాక్టర్ సృజన, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి బీరువాను వితరణగా అందించారు. కార్య క్రమంలో ప్రియాంక నర్సింగ్ కళాశాల తరపున అనిల్, మండల వైద్యా ధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో అవస్థలు



మూడురోడ్ల కూడలిలో అస్తవ్యస్థంగా ట్రాఫిక్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్డుకు ట్రాఫిక్ సమస్యగా మారింది. ఉదయం ప్రయివేట్ స్కూల్ బస్సులు, ఆటోలు, ఆర్‌టిసి బస్సులు మూడు రోడ్డు కూడలి వద్ద నిలపవడం వల్ల ట్రాఫికకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వేంపల్లి, రాయచోటి నుంచి వచ్చే ఆర్‌టిసి బస్సులు బస్‌స్టాప్ కూడలిలో నిలపడం వల్ల సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎంఇఒ-2ను కలిసిన పిఆర్‌టియు నాయకులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డి

లక్కిరెడ్డిపల్లె ఎంఇఒ-2గా బాధ్యతలు చేపట్టిన వెంకట సుబ్బయ్యను శనివారం పిఆర్‌టియు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి సూర్యుడు నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బండపల్లి శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు హెచ్. శ్రీనివాసులు , సభ్యులు కృష్ణమూర్తినాయక్, వెంకటరమణ, రవికుమార్, జనార్ధన్, ఆంజనేయులు, మల్లికార్జున ఆయనను దుశ్శాలువా ఘనంగా సన్మానించారు.

జనసైనికుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన జనసైనికులు పోకూరి ఆంజనేయ, పోకూరి చిన్నయ్యలు గత కొద్దిరోజులుగా అనారోగ్యం పాలై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసేన యువనాయకులు ప్రశాంత్ భారతాల ఆధ్వర్యంలో రాజంపేట జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు సహకారంతో ఇబ్బందులు పడుతున్న జనసైనిక కుటుంబాలకు రూ.70వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం గ్రామంలో ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ భారతాల మాట్లాడుతూ ప్రజల బాగోగుల కోసం ప్రజల సంక్షేమం కోసమే జనసేన పార్టీ ఆవిర్భవించిదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటే శ్వరావు ,లీగల్ సెల్ కత్తి సుబ్బారాయుడు, రాటాల రామయ్య , వీరమహిళా రెడ్డి రాణి, రైల్వే కోడూరు నాయకులు వర్ధనగారి ప్రసాద్, మర్రిరెడ్డిప్రసాద్, శ్రీధర్, మని , అనంతరాయులు, నందలూరు మండల నాయకులు తిప్పా యపల్లి ప్రశాంత్, మస్తాన్, ఎల్లచర్ల హరి, ఈశ్వర్, గోపికృష్ణ, భాస్కర్ పంతులు, పోకూరి నరేష్, పోకూరి మల్లికార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.



బస్ షెల్టర్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి, సర్పంచ్‌లు

బస్సు షెల్టర్‌కు స్థలాన్ని పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని బస్సు షెల్టర్ శిథిలమైనందున అక్కడ నూతన బస్సు షెల్టర్ నిర్మించేందుకు ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి శని వారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం త్వరలోనే నూతన బస్సు షెల్టర్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ప్రజలకు ఎటు వంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుక రావాలన్నారు. మండలాభి వృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ బస్‌షెల్టర్ నిర్మాణం కొరకు ఎంపిపి ఎంతగానో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకేపాటి శ్రీనివా సరెడ్డి, దొండ్లోపల్లి సర్పంచ్ మణి, పంచాయతీ కార్యదర్శి పెంచ లయ్య, భోగా పార్ధసారథి, సామారాంబాబు, మాడగలం శ్రీను, రంగారెడ్డి పాల్గొన్నారు.


బిపి ఆపరేటర్ అందజేత

పీలేరు : మండలంలోని బొడుమల్లువారి పంచాయతీ, సచివాలయ పరిధిలోని ప్రజల ఆరోగ్య సేవల కోసం స్థానిక సర్పంచ్ జయలక్ష్మి దేవి బిపి ఆపరేటర్, గర్భిణుల బరువు చూసుకోవడానికి వేయింగ్ మిషన్ వితరణ చేశారు. శనివారం బోడుమల్లువారిపల్లె పంచాయతీ కార్యాలయంలో వాటిని ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూన్న ఎఎన్‌ఎం, సిహెచ్‌ఒలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం వయస్సు, ప్రాంతం, ఆడ, మగ భేదం లేకుండా పెరుగుతున్న జీవనశైలి వ్యాధుల్లో ఒకటైన బిపిని పరీక్షించుకునేందుకు బిపి ఆపరేటర్ వితరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త అమరనాథ్‌రెడ్డి, కార్యదర్శి హరిప్రసాద్, ఎఎన్‌ఎం రేణుక, సిహెచ్‌ఒ రాజేశ్వరి, ఆశ కార్యకర్త రెడ్డెమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మిట్స్'లో రేడియో స్థాపన

ప్రజాశక్తి-కురబలకోట

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెడియోను స్థాపించడం గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగమని డిల్లీకి చెందిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం పేర్కొన్నారు. శనివారం కళాశాలలో స్థాపించిన మిట్స్ కమ్యూనిటీ రేడియో 90 ఎంహెచ్‌జడ్‌ను ఆయన ప్రారంభించారు. కళాశాలలో స్థాపించిన మిట్స్ కమ్యూనిటీ రేడియోను చూసి కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరిని అభినందించారు. మారుమూల గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి ఒక రేడియోను ఆవిర్భవించడం, ఈ రేడియో స్టేషన్ ద్వారా ఎంతో మందికి టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, పర్యావరణం మొదలైన వాటి గురించి రేడియో ద్వారా సమాచారం, సూచనలను అందిచడం ఎంతో గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ అకాడమీ ప్రెసిడెంట్ ద్వార కానాథ్, ప్రిన్సిపల్ సి.యువరాజ్, మదనపల్లె డిఎస్‌పి కేశప్ప పాల్గొన్నారు.



రేడియోను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ టి.జి సీతారాం



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న శ్రీనివాసరాజు

హోమియోపతి మందులకు రూ.75 వేలు విరాళం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని సాయినగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో ప్రతి ఆది, సోమ వారాలలో సద్గురు సాయినాథ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పేదలకు ఉచిత హోమియోపతి మందులు సరఫరా చేసేందుకు శనివారం ఎల్లటూరు శ్రీనివాసరాజు ఆలయ కమిటీ సభ్యులకు రూ.75 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పేదలకు సరిపడా ఒక ఏడాదికి సరిపడే మందులకు అవసరమైన ఆర్థికసాయం అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి తనవంతు సహ కారం అందిం చడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నరసారెడ్డి, కార్యదర్శి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు కృష్ణమరాజు, కోశా ధికారి ధనుంజయ, సింగంశెట్టి నరేంద్ర, మాజీ జడ్‌పిటిసి శివరా మరాజు, మీసాల నారాయణ, మన్నేరు సుబ్బయ్య, పివిఆర్ కుమార్, షేక్‌అప్రోజ్, కిచ్చే గారిశివయ్య, పత్తి వెంకటసుబ్బయ్య, రవి కుమార్, మౌలా, చిట్టే భాస్కర్, నాని, హరిదర్బార్, రాజాఆచారి, బాబు, కెఆర్, గుర్రంకొండ నరసింహులు, తోట సురేష్, సూరి, నాజర్‌ఖాన్, చల్లామధు, శివసాయి, బి.విష్ణు పాల్గొన్నారు.

జులై 22న ప్రత్యేక లోక్ అదాలత్

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు కోర్టు ఆవరణంలో జూలై 22న జరిగే ప్రత్యేక లోక్ దాలత్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం స్థానిక సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణంలో న్యాయమూర్తి న్యాయవాదులతో కలిసి సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మన రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆదేశాల మేరకు జూలై 22న ప్రత్యేక లోక్ దాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మోటార్ వాహన కేసులు, భూ వివాదాల కేసులను ఈ స్పెషల్ లోక్ దాలత్‌లో పరిష్కరించుకునే వీలుందని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులు, అలాగే అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు, ఆక్సిడెంట్ కేసులకు కూడా త్వరిత గతిన పరిష్కారం లభిస్తు ందని తెలిపారు. కార్యక్రమంలో ఎజిపి వెంకటరమణా రెడ్డి, న్యాయ వాదులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులు భయపడొద్దు

ప్రజాశక్తి-వీరబల్లి

క్షయవ్యాధి గ్రస్తులు భయపడ వద్దని, సమయానికి మందులు వేసుకుంటూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరునెలల్లో వ్యాధి పూర్తిగా నయమ వుతుందని మండల వైద్యాధికారి వినయ్‌బాబు తెలిపారు. శనివారం మండలం లోని సోమవరం పంచాయతీ వడ్డే పల్లి లోని క్షయ వ్యాధి గ్రస్తుల ఇంటి వద్దకు వెళ్లి సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికే ఈవ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ప్రస్తుత కాలంలో క్షయ ఏమాత్రం పెద్ద జబ్బు కాదన్నా రు. ఈ నెల 26 నుంచి జులై 16 వరకు జరిగే లెప్రసి సర్వేలో ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి సరస్వతి, ఎఎన్‌ఎం ప్రేమకుమారి, పిహెచ్‌ఎం గంగమ్మ పాల్గొన్నారు.



టిబి రోగులకు వైద్యసలహాలు ఇస్తున్న వైద్యాధికారి వినయ్‌బాబు

క్రైం కార్నర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బాలికను అత్యాచారం చేసిన వ్యక్తి అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కె.కేశప్ప తెలిపారు. శనివారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం, గుమ్మసముద్రం పంచా యతీ బూచురెడ్డిగారిపల్లికి చెందిన వెంకట రమణ కుమారుడు ఆదినారాయణ (26)కు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఒక బాలిక పదవ తరగతి ఫెయిల్ అయి ఇంటి వద్ద ఖాళీగా ఉంటుందని చెప్పారు. ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న బాలికను చూసి గత కొద్ది రోజులగా మాయ మటలు చెప్పి నిన్ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి బలవంతంగా అత్యా చారానికి పాల్పడినట్లు తెలిపారు. బాలిక గర్భవతి కావడంతో తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, వారి ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట పోలీసులు ఆదినారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, బి.కొత్తకోట పట్టణంలోని దిగువ బస్టాండ్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు.

స్థల వివాదంలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని రాజు స్కూల్ సమీపంలో ఓ స్థల వివాదంలో శనివారం వైసిపిలోని రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. వైసిపిలోని ఇద్దరు ప్రముఖ నాయకులకు చెందిన వర్గీయులు కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేయగా పోలీసుల ఎదుటే ఇరువర్గాలు కర్రలతో హల్‌చల్ చేశారు. విషయం తెలుసుకున్న రాయచోటి అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి సంఘటన స్థలానికి ఇరు వర్గాలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించారు. వివరాల్లోకి వెళితే.. చిన్నమండెం మండలం చాకిబండకు చెందిన నాగమల్ రెడ్డికు ఇద్దరు భార్యలు ఉండగా వీరిలో పెద్దభార్యకు ఇద్దరు కుమారులు, ఓ కుమారై ఉందని, రెండవ భార్య కు పిల్లలు లేరని తెలిపారు. కొన్నేళ్ల కిందట నాగమల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడని చెప్పారు. ఆస్తి కోసం ఇద్దరి భార్యల మధ్య కొంత కాలంగా మనస్పర్ధలు నెలకొన్నట్లు తెలిపారు. రాయచోటిలో కోట్లాది రూపాయలు విలువ చేసే ఐదు సెంట్లు స్థలాన్ని రెండవ భార్య తన చెల్లెల పేరిట రాయించిందన్నారు. ఆ స్థలాన్ని ఓ ప్రముఖ నాయకుడికి విక్రయించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మొదటి భార్య కుమారులు ప్రముఖ వైసిపి నాయకుడు వర్గీయుల అండతో ఆ స్థలం తమదని, ఆ స్థలంలో రేకుల షెడ్డు వేసేందుకు ప్రయత్నించడంతో ఆ స్థలాన్ని కొనుగోలు చేసిన మరో వైసిపి ప్రముఖ నాయకుడు అడ్డుతగలడంతో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి దాడికి తీసినట్లు సమాచారం.